20022025-DIS-04_Layout 1 2/20/2025 4:01 AM Page 1



'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

# గట్టు దాటిన మాట

**రణవీర్** అల్లాబాదియా అనే యూట్యూబర్ చేసిన అసహ్యకరమైన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా దుమారం చెలరేగిన సంగతి తెలిసిందే. తల్లిదండ్రులు, పిల్లల అనుబంధంపై అతడు చేసిన ఆ వ్యాఖ్యలు అశ్లీలం హద్దులను మించిపోయాయి అనడం అతిశయోక్తి కాదేమో. కనీసం వాటి గురించి మాట్లాడుకోవడమూ సభ్య ప్రపంచానికి ఇబ్బందిగా ఉండటమే అందుకు కారణం. 'ఇండియా గాట్ లేటెంట్' పేరిట ప్రసారమయ్యే యూట్యూబ్ కార్యక్రమంలో హాస్యం పేరిట అతడు చేసిన అత్యంత జుగుప్సాకరమైన కామెంట్లపై సహజంగానే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. నిరసన ప్రదర్శనలూ జరుగుతున్నాయి. పార్లమెంటరీ స్థాయి సంఘంతో పాటుగా పలువురు ముఖ్యమంత్రులూ రణవీర్ తీరుపై దిగ్భ్రమ వ్యక్తం చేశారు. అసోంతో సహా దేశంలోని పలుచోట్ల అతనిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. వీటి నుంచి రక్షణ కోరుతూ రణవీర్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. అరెస్టు నుంచి సుప్రీంకోర్టు రక్షణ కల్పించినప్పటికీ అతడిని తీవ్రస్థాయిలో మందలించడం గమనార్హం. ఇబ్బడిముబ్బడిగా దాఖలవుతున్న ఎఫ్ఐఆర్‌ల దృష్ట్యా అరెస్టు నుంచి ఉపశమనం కల్పిస్తున్నట్టు సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. నిందితుడి మనసులో ఉన్న 'చెత్త'ను యూట్యూబ్ కార్యక్రమంలో వెళ్లగక్కినట్టు మండిపడింది. అతడి వ్యాఖ్యలు ఈ దేశపు కుమార్తెలను, సోదరీమణులను, తల్లిదండ్రులను సిగ్గుపడేలా చేశాయని అక్షింతలు వేసింది. ఇలా తీవ్రస్థాయిలో స్పందించడమే కాకుండా సదరు వీడియోలను యూట్యూబ్ నుంచి తొలగించాలని ధర్మాసనం ఆదేశించాల్సి రావడం దిగజారిపోతున్న సోషల్ మీడియా ప్రమాణాలకు అద్దం పడుతున్నది. హాస్యం పేరిట, వినోదం పేరిట కుప్పలుతెప్పలుగా వచ్చిపడుతున్న అశ్లీలతకు పరాకాష్ఠగా ఈ ఉదంతం నిలిచింది. ఈ నేపథ్యంలో వాక్, భావ వ్యక్తీకరణ స్వాతంత్ర్యాలపై మరోసారి తీవ్ర చర్చ మొదలైంది.


వివాదాస్పద కార్యక్రమం రూపొందించిన సమయ్ రైనా, జనం అసహ్యించుకునేలా వ్యాఖ్యలు చేసిన రణవీర్ ఇద్దరూ యూట్యూబర్లలో రైజింగ్ స్టార్లు అనేది గమనార్హం. వారికి తగినంతగా ఫాలోయింగ్ ఉండటమే కాకుండా, 'కౌన్ బనేగా కరోడ్‌పతి' ప్రత్యేక కార్యక్రమంలో అమితాబ్ సరసన రైనా చోటు దక్కించుకున్నాడు. అటు రణవీర్ అయితే ఏకంగా ప్రధాని నరేంద్రమోదీ చేతుల మీదుగా 'క్రియేటర్ ఆఫ్ ద ఇయర్'గా అవార్డు అందుకున్నాడు. వీరిద్దరూ కలిసి వండివార్చిన అశ్లీలతపై వ్యక్తమవుతున్న వ్యతిరేకత మీడియాపై ప్రభుత్వ నియంత్రణ ఆవశ్యకత దిశగా చర్చను మళ్లిస్తున్నది. ప్రజాస్వామికవాదుల్లో సహజంగానే దీనిపై ఆందోళన వ్యక్తమవుతున్నది. గతంలో వివాదాస్పద అంశాలు ప్రసారమైన ప్రతిసారీ ప్రజలు గగ్గోలు పెట్టడం, నియంత్రణ కోసం ప్రభుత్వం చట్టాలు, నిబంధనలు తీసుకురావడం తెలిసిందే. అయితే ఈ నిబంధనలు సమస్యకు పరిష్కారం కావు. అవి ప్రజాస్వామిక వ్యక్తీకరణకు గుదిబండలుగా మారుతాయని అనుభవంలో రుజువైంది. *2000వ సంవత్సరంలో వచ్చిన ఐటీ చట్టం, 2001లో* వచ్చిన ఐటీ నిబంధనలు ఇందుకు ఉదాహరణ. ప్రస్తుత సందర్భంలోనూ పూర్తిగా రసహీనమైన, పేలవమైన, హాస్యోక్తిగా ఏ మాత్రం అర్హత లేని వ్యాఖ్య ఇప్పుడు మరింత కఠినమైన నియంత్రణ డిమాండ్లకు దారితీయడం సమర్థనీయం కాదు. 'రణవీర్‌ది చెత్త మనస్తత్వం' అని మాత్రమే సుప్రీంకోర్టు పేర్కొన్నది. అతడు చేసింది మన చట్టాల ప్రకారం నేరం అవుతుందా? కాదా? అనేది కోర్టులు తేలుస్తాయి. ఇలా ఏది పడితే అది వాక్ స్వాతంత్ర్యం ముసుగులో సోషల్ మీడియాలో ప్రసారం కాకుండా అడ్డుకునేదాన్ని రూపొందించడంలో ఉన్నత న్యాయాధికారుల సహాయాన్ని సుప్రీంకోర్టు అర్థించడం విశేషం. ఏది ఏమైనా స్వీయ నియంత్రణ ముఖ్యం.

# కృష్ణా జలాలు.. నిజానిజాలు!

**ఇటీవలి కాలంలో కృష్ణా జలాల పంపిణీపై '2015, జూన్‌లో జరిగిన ఒప్పందం చేసుకోవడం ద్వారా కృష్ణా జలాల్లో కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణకు శాశ్వతంగా నష్టం కలుగజేసింది. తెలంగాణ వాటాను 299 టీఎంసీలకు పరిమితం చేసి 512 టీఎంసీల నీటిని ఆంధ్రాకు అప్పజెప్పింది' అని తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యతిరేకులు దుష్ప్రచారం చేస్తున్నారు. అందుకు వారు 2015, జూన్ 18, 19 తేదీల్లో జరిగిన అంతర్రాష్ట్ర సమావేశపు మినిట్స్‌ను సాక్ష్యంగా చూపిస్తున్నారు. ఆ మినిట్స్‌లో రాసుకున్న అంశాలను పూర్తిగా చదవకుండానే, చదివినా కుట్రపూరితంగా, ఉద్దేశపూరితంగానే అబద్ధాలను ప్రచారం చేస్తున్నారనుకోవాలి. వారు చూపిస్తున్న సమావేశపు మినిట్సే ఆ అబద్ధాలకు సాక్ష్యం.**



**శ్రీధర్‌రావు దేశ్‌పాండే**



ఆ మినిట్స్‌ను దగ్గరుండి రాయించింది నాటి కేసీఆర్ ప్రభుత్వంలో సాగునీటి సలహాదారులుగా పనిచేసిన దివంగత ఆర్.విద్యాసాగర్‌రావు. తెలంగాణ సాధన ఉద్యమంలో నీళ్లల్లో నిప్పులు రగిలించినవాడు ఆర్.విద్యాసాగర్‌రావు. ఉమ్మడి రాష్ట్రంలో సాగునీటి రంగంలో జరిగిన అన్యాయాలను, వివక్షను ప్రజలకు పూసగుచ్చినట్టు తన ఉపన్యాసాల్లో వివరించాడు. పత్రికల్లో వందలాది వ్యాసాలను రాసి నీటి సంగతులు ప్రజలకు తెలియపరిచాడు. ఆ వ్యాసాలను 'నీళ్లు-నిజాలు' పేరుతో రెండు సంకలనాలుగా ప్రచురించి ప్రజలను చైతన్య పరిచాడు. అలాంటి నిబద్ధ, నిష్కళంక ఉద్యమకారుడు కృష్ణా జలాల పంపిణీలో తెలంగాణకు అన్యాయం చేస్తాడని ఊహించడానికే కంపరంగా ఉన్నది. కృష్ణా జలాల పునః పంపిణీ కోసం 2002 నుంచే పోరాటం చేసిన ఉద్యమ నాయకుడు కేసీఆర్ కృష్ణా జలాల్లో తెలంగాణకు అన్యాయం జరిగితే ఒప్పుకుంటారా? ఆ సమావేశానికి ఢిల్లీ వెళ్లే ముందు ఆనాటి సీఎం కేసీఆర్‌తో సమీక్షా సమావేశం జరిగింది. అందులో రాష్ట్ర వైఖరిని చర్చించాం. అప్పటికే ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2014 ప్రకారం కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్‌ఎంబీ) ఏర్పాటైంది. 2015-16 వాటర్ ఇయర్‌కు నీటి పంపిణీ చేయవలసిన బాధ్యత కృష్ణా బోర్డుదే. అదే విభజన చట్టం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 2014, మే 15న గజిట్ నోటిఫికేషన్ జారీచేసి బ్రిజేష్ కుమార్ (కెడబ్ల్యూడీటీ-2) ట్రిబ్యునల్‌కు రెండేండ్ల పాటు పదవీ కాలాన్ని పొడిగించింది. 2014, జూన్ నుంచే ట్రిబ్యునల్ విచారణను ప్రారంభించింది. ట్రిబ్యునల్ ముందు హాజరు కావాలని తెలంగాణ సహా 4 రాష్ట్రాలకు 2014, జూన్ 20న నోటీసులూ జారీ చేసింది. దీంతో రెండేండ్లలో తీర్పును వెలువరించే అవకాశం ఉన్నదనే ఆశాభావం అందరిలో కలిగింది.

> ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జలయజ్ఞం కింద ప్రారంభించిన కృష్ణా బేసిన్ ప్రాజెక్టులైన కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతల ప్రాజెక్టులు ఇంకా నీటిని వినియోగించుకునే దశకు రాలేదు. అనేక సమస్యల కారణంగా అవి పెండింగ్ ప్రాజెక్టులుగానే మిగిలిపోయాయి. తెలంగాణ ఏర్పాటు కాగానే కరువుకు, వలసలకు, రైతుల ఆత్మహత్యలకు నిలయంగా మారిన మహబూబ్‌నగర్ జిల్లా ప్రాజెక్టులను పూర్తిచేయడానికి కేసీఆర్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యాన్నిచ్చింది. భూసేకరణ చేసింది. అటవీ సంబంధిత, రైల్వే, రోడ్డు క్రాసింగ్ సమస్యలను పరిష్కరించింది. 2015 నాటికి ఆ ప్రాజెక్టుల పనులు ఇంకా పురోగతిలో ఉన్నాయి.

పైన వివరించిన కారణాల రీత్యా 2015 జూన్ 18, 19 తేదీల్లో రెండు రోజుల పాటు జరిగిన అంతర్రాష్ట్ర సమావేశంలో సాగునీటి సలహాదారుగా తెలంగాణ బృందానికి నాయకత్వం వహించి, కృష్ణా జలాల నీటి పంపిణీపై ఒక ఏడాది కోసం తాత్కాలిక వెసులుబాటు (Working Arrangement) ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఆ మినిట్స్‌లో తెలంగాణ ప్రయోజనాలకు ఎటువంటి భంగం కలగకుండా ఆర్.విద్యాసాగర్ రావు చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. మొదటి పేజీలో రెండుసార్లు, చివరి పేజీలో రెండు సార్లు ఒక ఏడాది కోసమే ఈ ఒప్పందం అని, ఈ ఒప్పందం ట్రిబ్యునల్, కోర్టులు, ఇతర చట్టబద్ధ సంస్థల ముందు రాష్ట్రాల నీటి హక్కులపై ఏ రకమైన ప్రభావాన్ని చూపజాలదని నొక్కిచెప్పారు. మొదటి పేజీలోని 5వ పేరాలో "It was agreed in the meeting that the figures of share of the two states as mentioned list of projects dated 18.10.2013 (appended herewith as Annexure) may be followed as the working arrangement for the current year only without prejudice to the rights of the two states about their entitlements which have been raised or to be raised before appropriate fora." ఈ విధంగా రాశారు. అదే పేజీలోని 6వ పేరాలో "The representatives of both the States agreed that they may utilize their share of water wherever they decide subject to availability of water at that place and without affecting the rights of other State." ఈ విధంగా నమోదై ఉన్నది. అదే పేజీలోని 7వ పేరాలో "Thereafter, project related issues were discussed and following working arrangements for the water year 2015-2016 only were agreed as a temporary measure." ఈ విధంగా నమోదై ఉన్నది. వీటికి అదనంగా చివరలో మరొకసారి ఇవే మాటలను విద్యాసాగర్ రావు నమోదు చేయించారు. చివరి పేజీలోని 17, 18వ పేరాలలో వాక్యాలు ఈ విధంగా నమోదు అయినాయి. 17వ పేరాలో : "It was agreed that for current year the quantity of water available after allocation of 811 TMC would be shared proportionately. Similarly, the deficit below 811 TMC would also be shared accordingly." అని, 18వ పేరాలో : "The entire arrangements agreed for the current year would be without any prejudice to the stand of both the States before any forum." అని మినిట్స్‌లోని ఈ వాక్యాలను చదివి కూడా నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం శాశ్వతంగా తెలంగాణ నీటి హక్కులను ఆంధ్రాకు ధారాదత్తం చేసిందని ఎవరైనా భావిస్తే వారి ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానాన్ని శంకించవలసి వస్తుంది. లేదంటే కేవలం రాజకీయ ప్రయోజనాలను ఆశించి మాత్రమే దుష్ప్రచారం చేస్తున్నారనుకోవాలి.

2018 నాటికి పైన పేర్కొన్న మహబూబ్‌నగర్ ప్రాజెక్టులు.. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ఎత్తిపోతలు బీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టిన ప్రత్యేక శ్రద్ధ వల్ల పూర్తయి పాక్షికంగా నీటిని వినియోగించుకునే దశకు చేరుకున్నాయి. ఆర్డీఎస్ కాలువకు కింద ఉన్న 58 వేల ఎకరాల స్థిరీకరణకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కూడా 11 నెలల్లో పూర్తి చేయించింది. కాబట్టి, ఒక ఏడాది కోసం చేసుకున్న ఒప్పందాన్ని వదిలేసి ట్రిబ్యునల్ తీర్పు వచ్చేవరకు కృష్ణా జలాల్లో 50 శాతం నీటిని వినియోగించుకోవడానికి అనుమతినివ్వాలని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు, కృష్ణా యాజమాన్య బోర్డుకు నిరంతరం నివేదిస్తూనే ఉన్నది తెలంగాణ ప్రభుత్వం. 2018, ఫిబ్రవరి 15న రాసిన లేఖతో మొదలైన 50 శాతం నీటి పోరాటం 2023 దాకా కొనసాగింది. ఏటా జరిగే కృష్ణా బోర్డు సమావేశాల్లో మన ప్రతినిధులు ఈ అంశంపై గట్టిగా వాదించారు. అయితే బోర్డు చైర్మన్ తన విచక్షణాధికారాలను వినియోగించి 34(తె): 66 (ఆం) నిష్పత్తిని కొనసాగించేవారు. చైర్మన్ ఈ విచక్షణాధికారాన్ని ప్రశ్నిస్తూ అనేక సార్లు కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖకు కూడా లేఖలు రాశారు. కేంద్రం ఈ విషయంలో తీసుకున్న చర్యలు శూన్యం. 2021లో జరిగిన కృష్ణా బోర్డు 14వ సమావేశంలో, 2022లో జరిగిన 16వ సమావేశంలో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ రజత్ కుమార్ కృష్ణా బేసిన్ ప్యారామీటర్లను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ కృష్ణా జలాల్లో 70.80 శాతం వాటా పొందడానికి అర్హత ఉన్నదని గట్టిగా వాదించారు. కృష్ణా బేసిన్‌లో ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుకు (ఎస్ఎల్‌బీసీ)కి 40 టీఎంసీలు, కల్వకుర్తి ప్రాజెక్టుకు 40 టీఎంసీలు, నెట్టెంపాడుకు 25 టీఎంసీలు మొత్తం 105 టీఎంసీలు వినియోగం కోసం అవసరమని, ఈ నీటిని వాడుకోవడానికి అనుమతించాలని పట్టుబట్టారు.

> ట్రిబ్యునల్ తీర్పు వచ్చేదాకా 811 టీఎంసీలలో 405.5 టీఎంసీలను తెలంగాణ వాడుకుంటుందని బోర్డు చైర్మన్‌కు నివేదించారు. 2023లో జరిగిన బోర్డు 17వ సమావేశంలో కూడా 50 శాతం నీటి వాటా కోసం గట్టిగా వాదించడమే కాదు, బోర్డు చైర్మన్ తన విచక్షణాధికారంతో నీటి పంపిణీ నిష్పత్తిని నిర్ధారించడాన్ని తెలంగాణ ప్రతినిధులు అడ్డుకున్నారు. ఈ రకంగా 50 శాతం తాత్కాలిక నీటి వాటా కోసం పోరాటం కేసీఆర్ ప్రభుత్వంలో కొనసాగింది.

అదే సమయంలో నాటి కేసీఆర్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల పరిష్కార చట్టం-1956, సెక్షన్ 3 ప్రకారం.. కృష్ణా ట్రిబ్యునల్ వేయమని కేంద్రాన్ని నిరంతరం కోరింది. సాగునీటి మంత్రిగా హరీశ్‌రావు కేంద్ర జల వనరుల మంత్రులకు, ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రధాని మోదీకి వ్యక్తిగతంగా లేఖలు కూడా రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నెల రోజులకే సెక్షన్ 3 కింద కృష్ణా జలాల పునఃపంపిణీ అంశాన్ని కృష్ణా ట్రిబ్యునల్‌కు నివేదించాలని కోరింది. 2016లో జరిగిన మొదటి అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కూడా ఈ అంశంపై కేసీఆర్ గట్టిగా వాదించారు. ట్రిబ్యునల్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఆనాటి కేంద్ర జల వనరుల మంత్రి ఉమాభారతి హామీ ఇచ్చారు. ఆమె ఈ అంశంలో చిత్తశుద్ధితోనే వ్యవహరించారు. కానీ, ఆమె ప్రయత్నాలను కొన్ని దుష్టశక్తులు అడ్డుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం లేఖ రాసి ఒకటిన్నర రెండేండ్లు గడిచినా కేంద్రంలో చలనం రాలేదు. న్యాయం కోసం తెలంగాణ ప్రభుత్వం సుప్రీంను ఆశ్రయించింది. సుప్రీంలో కేసు ఉన్నప్పటికీ కేంద్రంతో ఈ అంశంపై నిరంతరం సంప్రదింపులు జరిపింది.

విభజన చట్టం సెక్షన్ 89 ప్రకారం... బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ విచారణ జరుపుతుండగా మళ్లీ ఈ సెక్షన్ 3 కింద ట్రిబ్యునల్ వేయమని ఎందుకు కోరుతున్నారని మేధావులకు సహా చాలామందికి అర్థం కాలేదు. సెక్షన్ 3 కిందనే విచారణ జరగాలని కేసీఆర్ ప్రభుత్వం కోరుకోవడానికి కారణం ఉన్నది. విభజన చట్టం సెక్షన్ 89లో కృష్ణా జలాల పునః పంపిణీ ప్రస్తావన లేదు. ప్రాజెక్టుల వారీగా నీటి కేటాయింపులు చేయమని మాత్రమే అందులో ప్రస్తావించింది. ఇది చట్టం రూపొందించినప్పుడు జరిగిన తప్పిదం. అందులోనే సెక్షన్ 3 కింద పునఃపంపిణీ అంశాన్ని చేర్చి ఉంటే ఈపాటికి తెలంగాణ న్యాయమైన వాటా పొంది ఉండేది. చట్టం రూపకర్తలు ఆంధ్రా అనుకూల చట్టాన్ని తయారుచేశారు. విభజన చట్టంలో ఇలాంటి అనేక తప్పిదాలు జరిగిన సంగతి ఉద్యమకారులు గుర్తించి సవరణ చేయమని కోరారు. మీకు చట్టం ఆమోదం కావాలో, సవరణలు కావాలో తేల్చుకోండని కేంద్ర ప్రభుత్వ పెద్దలు బెదిరిస్తే ఇక తప్పనిసరి పరిస్థితుల్లో సవరణలకు పట్టుబట్టకుండా తప్పులతోనే చట్టం ఆమోదానికి సమ్మతించవలసి వచ్చింది.

> సెక్షన్ 89 కింద విచారణ వల్ల తెలంగాణకు న్యాయం జరగదన్న స్పృహ కేసీఆర్‌కు ఉన్నది. ట్రిబ్యునల్ కూడా సెక్షన్ 89 కింద తమకు కృష్ణా జలాల పునః పంపిణీకి అవకాశం లేదని, పునః పంపిణీ అనే అంశం తమ విచారణ పరిధిలో లేదని రెండుసార్లు రాతపూర్వకంగా తమ తీర్పుల్లో పేర్కొన్నది. ఇవే అభిప్రాయాలను విచారణ సందర్భంగా అనేక సార్లు వెల్లడించింది. కాబట్టే సెక్షన్ 3 కింద జరిగే విచారణ ద్వారానే రెండు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల పునఃపంపిణీ న్యాయబద్ధంగా జరుగుతుందని భావించి నిరంతరం పోరాడారు.

2020, అక్టోబర్‌లో జరిగిన 2వ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో కేసీఆర్ ఈ అంశంపై పదే పదే పట్టుబడితే నాటి కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెఖావత్ ట్రిబ్యునల్ వేయడానికి అంగీకరించారు. అయితే, అందుకు మెలికలు పెట్టారు. ఒకటి, తెలంగాణ ప్రభుత్వం సుప్రీంలో వేసిన కేసును వాపస్ తీసుకోవాలి. రెండు, సెక్షన్ 3 రిఫరెన్స్‌ కొత్త ట్రిబ్యునల్‌కు నివేదించాలా, లేదా సెక్షన్ 89 కింద విచారణ జరుపుతున్న ప్రస్తుత బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించాలా అన్న అంశంపై కేంద్ర న్యాయశాఖ అభిప్రాయం తీసుకుంటామని, ఆ తర్వాతే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇవన్నీ మినిట్స్‌లో నమోదయ్యాయి. కేంద్ర మంత్రి హామీని పురస్కరించుకొని సుప్రీంలో కేసు వాపస్ తీసుకొమ్మని కేసీఆర్ అధికారులను ఆదేశించారు. సుప్రీంకోర్టు 2021 అక్టోబర్‌లో కేసు వాపస్ తీసుకోవడానికి తెలంగాణ రాష్ట్రాన్ని అనుమతించింది. ఇది జరిగి రెండేండ్లు గడిచిన తర్వాత అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2023, అక్టోబర్‌లో సెక్షన్ 3 కింద అదనపు రెఫరెన్స్‌ను బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు నివేదించింది. దీంతో కృష్ణా ట్రిబ్యునల్ కోసం కేసీఆర్ ప్రభుత్వం చేసిన పదేండ్ల పోరాటం ఫలించింది. కేంద్రం చేసిన ఈ రిఫరెన్స్‌ను వ్యతిరేకిస్తూ ఏపీ ప్రభుత్వం సుప్రీంలో కేసు వేసింది. ఈ కేసు విచారణ ఇంకా జరుగుతున్నది. అయితే, ఏపీ కోరిన స్టేను మాత్రం మంజూరు చేయకపోవడం తెలంగాణకు ఒక ఊరట. ఇటీవల ట్రిబ్యునల్ కూడా సెక్షన్ 3 కిందనే తొలుత విచారణ చేస్తామని ప్రకటించడం మరొక ఊరట.

> ఇక్కడ ప్రజలు, మేధావులు, బుద్ధిజీవులు రాజకీయాలకతీతంగా ఆలోచించవలసిన అంశం ఏమంటే... కేసీఆర్ ప్రభుత్వం చేసిన నిరంతర కృషి, పోరాట ఫలితమే సెక్షన్ 3 రిఫరెన్స్‌లు. ఇది విస్మరించరాని సత్యం. కేసీఆర్ ప్రభుత్వం ట్రిబ్యునల్ ముందు ఉంచిన డిమాండ్ 575 టీఎంసీలను సాధించడం ఎట్లా? అన్నదే ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం ముందు, తెలంగాణ సమాజం ముందున్న అసలైన సవాలు. ఇందులో రాజకీయాలకు తావు లేదు. తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం.

కనీసం ఈ అంశంలోనైనా రాజకీయ విమర్శలు మాని ఏకోన్ముఖంగా ముందుకుసాగడమే మనందరి లక్ష్యం కావాలి. ఈ రోజు అధికారంలో ఉండే మనుషులు, పార్టీలు రేపు అధికారంలో ఉండకపోవచ్చు. కానీ, ప్రభుత్వం రాజ్యాంగబద్ధంగా కొనసాగే నిరంతర వ్యవస్థ. ఈ అవగాహనతో, ఈ కీలక సమయంలో గత కేసీఆర్ ప్రభుత్వంపై రాజకీయ విమర్శలు మాని కృష్ణా ట్రిబ్యునల్ ముందు వాదించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. అందరినీ కలుపుకుపోవాలి. ఈ విషయంలో ప్రభుత్వానికి సహకరించడానికి ప్రతీ ఒక్కరూ సిద్ధంగానే ఉంటారు. ట్రిబ్యునల్‌లో న్యాయమైన వాటా సాధించడమే లక్ష్యంగా ఏకోన్ముఖ కృషి తెలంగాణ సమాజం తరఫున జరగాలి.

(వ్యాసకర్త: విశ్రాంత సూపరింటెండింగ్ ఇంజినీర్)

**నాటి కేసీఆర్ ప్రభుత్వం అంతర్రాష్ట్ర నదీజలాల వివాదాల పరిష్కార చట్టం-1956, సెక్షన్ 3 ప్రకారం.. కృష్ణా ట్రిబ్యునల్ వేయమని కేంద్రాన్ని నిరంతరం కోరింది. సాగునీటి మంత్రిగా హరీశ్‌రావు కేంద్ర జల వనరుల మంత్రులకు, ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రధాని మోదీకి వ్యక్తిగతంగా లేఖలు కూడా రాశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన నెల రోజులకే సెక్షన్ 3 కింద కృష్ణా జలాల పునఃపంపిణీ అంశాన్ని కృష్ణా ట్రిబ్యునల్‌కు నివేదించాలని కోరింది.**

# చెరిపేస్తే చెరిగిపోదు ఉద్యమ చరిత్ర

**ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయాల్లోకి రాకముందు, యువకుడిగా ఉన్నప్పుడు గోడ మీద ఎన్నికల నినాదాలు రాసేవారు. కల్వకుర్తి నియోజకవర్గంలో గోడల మీద చిన్నారెడ్డి కోసం నినాదాలు రాశారు. తర్వాత స్క్రీన్ ప్రింటింగ్ పనిచేశారు. ఎన్నికలు ముగిశాక ఇంటి మీద రాతలు చెరిపేయాలి. స్క్రీన్ ప్రింటింగ్‌లో సైతం అంతే. అయితే, ఆ రాతలు చెరిపివేసినంత ఈజీగా తెలంగాణ ఉద్యమ చరిత్రను చెరిపివేయవచ్చని ముఖ్యమంత్రి భావిస్తున్నట్టుగా ఉంది.**



**బుద్ధా మురళి**



చాయ్ వాలా ప్రధాని అయినా, గోడల మీద రాతలు రాసేవాళ్లు సీఎం అయినా అది ప్రజాస్వామ్య గొప్పతనం. ప్రజాస్వామ్యం వల్లే తామీ స్థాయికి వచ్చామని అనుకోవాలి కానీ, తాము నియంతలమనో, రాజకుటుంబాల నుంచి వచ్చామనో భావించి సామాజిక బహిష్కరణ వంటి ఫ్యూడల్ భావాలను వ్యక్తం చేయకూడదు. తలసాని శ్రీనివాస్ యాదవ్ మంత్రిగా ఉన్నప్పుడు 'సికింద్రాబాద్ మార్కెట్‌లో ఆలుగడ్డలు అమ్ముకున్న వ్యక్తి కూడా మాట్లాడుతున్నాడు' అని రేవంత్‌రెడ్డి విమర్శించారు. కేసీఆర్ వ్యతిరేకత అనే ఏకైక భావనతో మేధావులు, మీడియా రేవంత్‌రెడ్డి సామాజిక బహిష్కరణ పిలుపుపై నోరు ఎత్తలేని పరిస్థితి. 'నన్ను ఏమైనా అనండి భరిస్తాను.. తెలంగాణను అవమానిస్తే గొయ్యి తీసి పాతి పెడతా' అని కేసీఆర్ అంటే మీడియాపై దాడి అని నాడు గగ్గోలు పెట్టిన మీడియా.. నేడు సామాజిక బహిష్కరణకు పిలుపు ఇచ్చినా, మీడియా డీఎన్ఏ పరీక్ష చేసుకోవాలని తిట్టినా, ప్రకటనల పేరుతో గొంతు నొక్కినా మౌనంగానే భరిస్తున్నది.

> **కేసీఆర్ నాయకత్వం వల్లనే తెలంగాణ సాకారమైంది. తెలంగాణపై అవగాహన లేనివారు, కేసీఆర్‌ను చిన్నచూపు చూడాలనుకునే వారు, వ్యక్తిగత వ్యతిరేకత ఉన్నవారు దీన్ని అంగీకరించకపోవచ్చు. కానీ 'కేసీఆర్ వల్లనే తెలంగాణ సాధ్యమైందని మరో పార్టీలో ఉన్నా నేనూ అంగీకరించాల్సిందే' అని మహా టీవీలో ఐ.వెంకట్రావుతో జరిగిన ఇంటర్వ్యూలో గతంలో రేవంత్‌రెడ్డి చెప్పారు.**

ఇప్పుడు అదే రేవంత్‌రెడ్డి.. కేసీఆర్ స్థానంలో దేవేందర్‌గౌడ్‌ను నిలబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కొన్ని వందల సంవత్సరాల క్రితం జరిగిన ఉద్యమం అయితే, మీడియా చేతిలో ఉంటే మనకు నచ్చినవారి నాయకత్వంలోనే తెలంగాణ సాకారమైందని నమ్మించవచ్చు. దేవేందర్‌గౌడ్ కాదు, చంద్రబాబు వల్లే అని కూడా నమ్మించవచ్చు. కానీ, 2001లో ఉద్యమం మొదలైంది. 23 ఏండ్లు అవుతున్నది. రాష్ట్ర జనాభాలో అత్యధిక శాతం ఆ ఉద్యమ కాలంలో ఉన్నవాళ్లే. చరిత్రను గోడ మీద ఎన్నికల రాతల్లా సున్నం వేసి చెరిపేయలేరు. ఇప్పుడున్న ప్రజల్లో అత్యధిక శాతం ఏదో ఒక విధంగా ఉద్యమంలో పాలు పంచుకున్నవాళ్లే. ఉద్యమంలో ఏం జరిగింది? ఎవరు ఎటు వైపు నిలిచారో ఉద్యమ చరిత్ర వారి మనోఫలకంపై లిఖించి ఉన్నది. దాన్ని చెరిపేయలేరు .

మహాత్మాగాంధీ స్థానంలో పటేల్‌ను నిలిపేందుకు బీజేపీ చేస్తున్న ప్రయత్నాల స్ఫూర్తితో కేసీఆర్ స్థానంలో ఉద్యమ నాయకుడిగా దేవేందర్‌గౌడ్‌ను నిలిపేందుకు రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రను వివరిస్తూ దశాబ్దం క్రితం నేను ఓ వ్యాసం రాస్తే ప్రస్తుత బీజేపీ నాయకుడు, అప్పటి దేవేందర్‌గౌడ్ పీఏ ఫోన్ చేసి తెలంగాణ ఉద్యమ చరిత్రలో దేవేందర్ గౌడ్‌కు స్థానమే లేదా? అని ప్రశ్నించారు. టీడీపీ నుంచి బయటకు వచ్చి తెలంగాణ కోసం పార్టీ పెట్టి, ప్రజారాజ్యంతో పొత్తు, స్వయంగా ఓడిపోయి తిరిగి టీడీపీలో చేరారు దేవేందర్‌గౌడ్. 'నన్ను ఎదిరించి ఎవరు బయటకు వెళ్లినా దేవేందర్ గౌడ్‌లా తిరిగి నా వద్దకు రావలసిందే' అని బాబు చెప్పినట్టుగా ఉన్నదని, ఇది మిగిలిన నాయకులను భయపెట్టడానికి ఉపయోగపడింది తప్ప తెలంగాణ ఉద్యమానికి ఏ విధంగానూ ఉపయోగపడలేదని ఆయనకు వివరించాను. టీడీపీ నుంచి బయటకు వెళ్లాలనుకున్న తెలంగాణ నాయకులు సైతం దేవేందర్‌గౌడ్ ఉదంతంతో ఆందోళన చెందారు.

ముఖ్యమంత్రి పదవి చేపట్టగానే రేవంత్‌రెడ్డి ప్రధానంగా చెరిపేసే పని చేపట్టారు. 'కేసీఆర్ ఆనవాలు లేకుండా చేస్తాను' అని శాసనసభలోనే ప్రకటించారు. తెలంగాణ అధికార చిహ్నం మార్పుతో శ్రీకారం చుట్టాలని అనుకున్నారు. అధికార చిహ్నం నుంచి చార్మినార్‌ను తొలగించాలని నిర్ణయిస్తే బీజేపీ స్వాగతించింది. కాంగ్రెస్ హైకమాండ్ ఈ నిర్ణయానికి బ్రేక్ వేసింది. పరువు నిలుపుకోవడం కోసం వాయిదా అని ప్రకటించారు. డిసెంబర్‌లో అధికార చిహ్నం మారుస్తామని ఆరు నెలల కిందట ప్రకటించారు. డిసెంబర్ వెళ్లి మూడు నెలలవుతున్నది. వీరికి మాత్రం ఇంకా డిసెంబర్ రాలేదు. వచ్చే అవకాశాలు కూడా లేవు. ఏడాదిన్నర గడుస్తున్నా రేవంత్‌రెడ్డికి ఇంకా పాలనపై పట్టు రాలేదు. సహజంగానే కాంగ్రెస్‌లో అందరూ సీఎంలే. ఈసారి సీనియర్లు మంత్రులు అయితే, కాంగ్రెస్‌లో అందరికంటే తక్కువ సీనియారిటీ ఉన్న రేవంత్‌రెడ్డి సీఎం. ఒక్క వైఎస్ఆర్‌ను మినహాయిస్తే ఒకటిన్నర సంవత్సరాలు సీఎం అంటే కాంగ్రెస్ చరిత్రలో చాలా ఎక్కువ కాలం అనే అనుకోవాలి.

చెరిపేసే పనులపై దృష్టి పెట్టిన సీఎంకు పాలనపై పట్టు చిక్కడం లేదు. టీడీపీ, కాంగ్రెస్‌ల్లో రేవంత్‌రెడ్డి అతి తక్కువ కాలంలో ఎదగడానికి బూతులు, దూకుడు ఉపయోగపడ్డాయి. రాజకీయ మెట్లు ఎక్కడానికి ఉపయోగపడిన బూతులు సీఎం పదవిలో సైతం ఉపయోగపడతాయని భావిస్తున్నారు. పిడుక్కీ, బియ్యానికి ఒకే మంత్రం పని చేయదు. రాజకీయ ప్రత్యర్థులను బూతులు తిడితే మీడియాలో హైలైట్ కావచ్చు కానీ పాలనపై పట్టు చిక్కదు, విషయ పరిజ్ఞానం వచ్చి వాలదు.

అనుభవం ఉన్న వైద్యులు మనిషి ఇంకెంత కాలం బతుకుతారో చెప్పగలరు. కాంగ్రెస్ హైకమాండ్ ఇంకెంత కాలం రేవంత్‌రెడ్డిని సీఎంగా ఉంచుతుందో ఎవరికీ తెలియదు. బీసీ సీఎం అని పీసీసీ అధ్యక్షుడు అప్పుడే మాట్లాడుతున్నారు. తెలంగాణ అధికార చిహ్నాన్ని నిర్ణయించే కనీస అధికారం కూడా ఇక్కడ ఎవరికీ లేదు. అంతా హైకమాండ్ చూసుకుంటుంది. రేవంత్‌రెడ్డి ఎంతకాలం ఉంటారు? బీసీని నియమిస్తారా? బీసీ అనేది వచ్చే ఎన్నికల్లో అని చెప్తారా? అన్న నిర్ణయాలు హై కమాండ్ తీసుకుంటుంది. తనకు లభించిన అవకాశాన్ని రేవంత్ ఇప్పటికైనా ఉపయోగించుకొని తెలంగాణకు నేనిది చేశాను, 'ఇది నా ముద్ర' అని చెప్పుకునేట్టు చేయాలి.

సివిల్ సర్వీస్ అధికారులకు రాజకీయ నాయకుల మీద చాలా చిన్న చూపు ఉంటుంది. పైకి వినయంగా కనిపించినా నాయకులు లేనప్పుడు వారిపై జోకులు వేసుకొని నవ్వుకోవడం అధికారులకు సర్వ సాధారణం. అదే విషయ పరిజ్ఞానం ఉన్న నాయకుల ముందు అధికారులు తోక జాడించరు. తమ హద్దుల్లో ఉండి పనిచేస్తారు. అధికారంలో ఉన్న నాయకుల ప్రాపకం కోసం అధికారులు ప్రయత్నించడం సర్వ సాధారణం. కానీ నాయకుల వద్ద విషయ పరిజ్ఞానం లేకపోతే వారి ప్రాపకం కోసం ప్రయత్నించే అధికారులు సైతం తమ అంతర్గత చర్చల్లో విషయ పరిజ్ఞానం లేని నాయకులను చిన్న చూపు చూస్తారు. అధికార వ్యవస్థపై స్వయంగా ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేస్తూ, పోలీస్ అధికారులు ట్రైనింగ్ పూర్తి కాకముందే యూనిఫాం ధరించి పోలీస్ స్టేషన్లలో కూర్చొని ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేస్తున్నారని, అధికారులు ఏసీ గదులు వీడటం లేదని, ఒక తప్పు చేయమని చెప్తే మూడు తప్పులు చేద్దామంటున్నారని అధికార వ్యవస్థపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిపాలన సాగేది మొత్తం అధికార వ్యవస్థ చేతుల మీదుగానే. ఆ వ్యవస్థ పైనే సీఎంకు అసంతృప్తి ఉంటే ప్రజలకు ఎలా ఉంటుందో అర్థమవుతూనే ఉన్నది. అధికారంలోకి వచ్చి ఒకటిన్నర సంవత్సరాలు కావస్తున్నా పాలన మీద సీఎంకు పట్టు లభించలేదు .

> **రేవంత్‌రెడ్డి టీడీపీలో చాలా స్వల్ప కాలంలో ఎదిగారు. అప్పటివరకు మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఎదురులేని నాయకుడిగా ఉన్న నాగం జనార్దన్‌రెడ్డి, రావుల చంద్రశేఖర్‌రెడ్డిని వెనక్కి నెట్టి స్వల్ప కాలంలో బాబుకు దగ్గరయ్యారు. జిల్లా పరిషత్తు సమావేశంలో ఒకసారి అదే జిల్లాకు చెందిన డీకే అరుణ పైకి ఏకంగా దూసుకువెళ్లారు. రావుల చంద్రశేఖర్‌రెడ్డి వెనక్కి తీసుకువచ్చారు. నిజానికి డీకే అరుణ కూడా అలా దూకుడుగా వ్యవహరించే నాయకురాలు. బాబు అధికారంలో ఉన్నప్పుడు ఆయన వాహనం ఎదురుగా బైఠాయించి అడ్డుకున్నారు. అలాంటి డీకే అరుణ మంత్రిగా ఉండటం వల్ల రేవంత్‌రెడ్డి స్థాయిలో దూకుడు ప్రదర్శించలేకపోయారు. మంత్రిగా ఉన్న అరుణ హుందాగా ఉండాలని భావిస్తే, సీఎంగా ఉండి రేవంత్ బూతులు నమ్ముకున్నారు.**

వార్తలు వస్తుంటే ఇంట్లో టీవీలు మూసేస్తున్నారని రేవంత్‌రెడ్డి చెప్పింది అక్షర సత్యం. అయితే అలా మూసేస్తున్నది ఆయన బూతులు వినలేకనే. ఇటీవల ఒక టీవీ చర్చలో రాజకీయ విశ్లేషకుడు పాపారావు మాట్లాడుతూ బూతులు రేవంత్‌రెడ్డికి మాత్రమే కాదని, ప్రజలకు కూడా వస్తాయని, ఒకసారి ప్రజల్లోకి వెళ్లి వినాలని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. కాబట్టి ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు ఎంత త్వరగా గ్రహిస్తే అంతమంచిది.